క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజను మెప్మా జిల్లా పీడీ రాధమ్మ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని ఆమె అందజేశారు.

కార్తీక వనభోజనాలకు తరలిరండి



సమావేశానికి హాజరైన నేతలు

నెల్లూరు(బారకాసు): కార్తీక వనభోజనాలు, దేవాంగ సంక్షేమ సంఘ ఆవిర్భావ వేడుకలకు తరలిరావాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నెం సతీష్, పముజుల శంకరయ్య కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వేదగిరి లక్ష్మీనృసింహ దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు.

మాదకద్రవ్య బాధితుల్లో మార్పునకు కృషి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ప్రమాదకర ప్రవర్తన కలిగి.. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారు, ఎమ్మెస్సెమ్ ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లలో మార్పు తెచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వైద్య శాఖ అధికారులు కృషి చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచించారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజానికి ఇబ్బందికరంగా కార్యకలాపాలు సాగిస్తున్న వారికి మెరుగైన వైద్యసేవలందించడంతో పాటు నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. ఏడీఎంహెచ్ఓ, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): హౌసింగ్ బోర్డు కాలనీలో విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, కార్తీక మాస వనభోజన కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీలో కొలువైన మహాకాళి సమేత మహామృత్యుంజయేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో అభిషేకాలు, వనభోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. విశ్వబ్రాహ్మణులు తరలిరావాలని కోరారు.

చాటుపద్యం ఎంతో విశిష్టమైంది



నెల్లూరు(బృందావనం): తెలుగు సాహిత్యంలో చాటు పద్యం ఎంతో విశిష్టమైందని గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకుడు నందనవనం శ్రీనివాసరావు పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో చాటు పద్యం – హాస్యం అనే అంశంపై చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. మెట్టు రామచంద్రప్రసాద్, జయప్రకాష్, నలుబోలు బలరామయ్యనాయుడు, గోవిందరాజు సుభద్రాదేవి, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, విశ్వనాథం, బుజ్జయ్య, పాయసం సుబ్రహ్మణ్యం మహర్షి, వేదిక నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, శేషగిరీశం పాల్గొన్నారు.

పన్నుల భారాన్ని తక్షణమే ఆపాలి



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల బకాయిలను బలవంతంగా వసూలు చేయడం తగదని, రెగ్యులరైజేషన్ పేరుతో పన్నుల భారాన్ని మోపే చర్యలను తక్షణమే ఆపాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నేతలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్ఈ రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. నేతలు సూర్యనారాయణ, మూలం ప్రసాద్, నరసింహ, పద్మ, రషీద్, చిరంజీవి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంతా గజిబిజి

చిన్నబజార్‌లోని వీధుల్లో అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన వైర్లు





- చిన్నబజార్‌లో అడ్డదిడ్డంగా వైర్లు
- పిచ్చుక గూళ్లను తలపిస్తున్న వైనం
- పొంచి ఉన్న ప్రమాదం





నెల్లూరు (పొగతోట): నగరంలోని పలు ప్రాంతాల్లో ఏ వీధి చూసినా వైర్లను అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన దృశ్యాలే తారసపడతాయి. దీంతో అవి పిచ్చుక గూళ్లను తలపిస్తున్నాయి. ప్రధానంగా చిన్నబజార్, పెద్దబజార్, స్టోన్‌హౌస్‌పేట తదితర చోట్ల వైర్లను ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు విద్యుత్ స్తంభాలకు ఇతర వైర్లను ఏర్పాటు చేయకూడదు. అయితే ఇది నగరంలో ఎక్కడా అమలుకావడంలేదు. అగ్నిప్రమాదం సంభవిస్తే పెను ముప్పు జరిగేందుకు ఆస్కారం ఉంది. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా నెలకొన్నా, ఎవరూ చర్యలు చేపట్టడంలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రహదారి నిబంధనలను పాటించాలి



ఎస్పీకి సత్కారం

నెల్లూరు (టౌన్): రహదారి నిబంధనలను వాహనదారులు తప్పక పాటించాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. ప్రమాదాల నివారణ.. ట్రాఫిక్ నియంత్రణపై నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెల్మెట్ ధరించకపోవడం.. అతివేగం.. సీటు బెల్టు పెట్టుకోకపోవడం.. మద్యం సేవించి వాహనాన్ని నడపడం.. తదితరాలతో నిత్యం ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. అనంతరం ఎస్పీని సత్కరించారు. నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఐ సాంబశివరావు, ట్రాఫిక్ సీఐలు వెంకటరెడ్డి, రామకృష్ణ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఏజీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్‌ను సాఫ్ట్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. అకడమిక్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్ తదితరాలను పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. అనంతరం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు దాదాపు 180 మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు.

పనివేళల మార్పు ప్రతిపాదనను విరమించుకోవాలి



ఏడీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): పాఠశాలల్లో పనివేళల మార్పు ప్రతిపాదనను విరమించుకోవాలని పూలే టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీకి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పనివేళల మార్పుతో విద్యార్థులు ఇబ్బందులు పడతారని చెప్పారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్, రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదవ వనభోజనాలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యాదవ కార్తీక వనభోజనాలను ఆదివారం నిర్వహించనున్నామని, కార్యక్రమానికి తరలిరావాలని యాదవ భవన్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ బొమ్మి నాగకిశోర్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గొలగమూడి రోడ్డులోని యాదవ భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. కమిటీ సభ్యులు రమణయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం, మధుసూదన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడికి అభిషేకాలు



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి అభిషేక మహోత్సవాన్ని వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విశేష పూజలను వైఖానస ఆగమ పండితుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు ఆధ్వర్యంలో జరిపారు. లక్కీడిప్ ద్వారా ఏడుగురు మహిళా భక్తులను ఎంపిక చేసి వారికి అమ్మవారి పాదాల చెంత ఉంచి చీరలను నిర్వాహకులు కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు అందజేశారు. ఉభయకర్తలుగా జొన్నలగడ్డ చంద్రశేఖర్‌రాజు, శైలజ దంపతులు వ్యవహరించారు. మందిర నిర్వాహకులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, వికాస్ ప్రజాహిత సేవా సమితి సభ్యులు రామాంజనేయరెడ్డి, శశిధర్, రఘుపతినాయుడు, రమణ, దినేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హనుమంతరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం





నెల్లూరు (టౌన్) / నెల్లూరు సిటీ: నగరంలోని కృష్ణచైతన్య, రావూస్ డిగ్రీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు ఏకేనగర్‌లోని ఎన్‌సీసీ యూనిట్‌లో రక్తదానాన్ని శుక్రవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ దినేష్, సుబేదార్ రజిత్‌సేన్ గుప్తా, ప్రసాద్, సీటీఓ, ఎన్‌సీసీ అధికారులు పెంచలప్రసాద్, సురేష్, వరప్రసాద్, మోటివేటర్ భాస్కర్‌రావు, స్టాఫ్ నర్స్ కృష్ణవేణి, టెక్నీషియన్ వెంకటేష్ పాల్గొన్నారు.

26న కోవూరులో జాబ్‌మేళా

నెల్లూరు (పొగతోట): కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్ పూర్తి చేసిన వారు హాజరుకావాలని కోరారు. వివరాలకు 97045 10793 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని క్రాంతినగర్, సరస్వతీనగర్, కేవీఆర్ పెట్రోల్ బంక్ ఎదురు ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 సరఫరా ఉండదని చెప్పారు.

- వైఎమ్సీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని లీలామహల్ రోడ్డు, చాకలివీధి, మహబ్‌పేట, జూబ్లీ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.
- బోడిగాడితోట సబ్‌స్టేషన్ పరిధిలోని యనమలవారిపాళెం, నవాబుపేట, శ్రీనివాసనగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, మైపాడురోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కిరణ్‌కుమార్

నెల్లూరు (టౌన్): జిల్లాకు చెందిన న్యాయవాది గంగవరపు కిరణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. భారతీయ మేథోసంపత్తి పాలనలో ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ల పేటెంట్ రక్షణ నిపుణుల సమస్యలు, లేఅవుట్ల పరిరక్షణ అనే అంశంపై రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో గల భగవంత్ వర్సిటీలో సంజయ్‌చౌదరి, పూర్ణిమ శ్రీవాత్సవ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను వర్సిటీ వారు ప్రదానం చేశారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 అధికారులు దాడులను ముమ్మరం చేశారు. వీఆర్సీ సెంటర్‌లోని బస్టాప్ సమీపంలో అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న శ్రీనివాసులును అరెస్ట్ చేసి, తొమ్మిది క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై మురళీకృష్ణ, సిబ్బంది శ్రీధర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న లక్ష్మీదేవి

నెల్లూరు సిటీ: బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై అవగాహన సదస్సును అల్లీపురంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సీడీపీఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండాకే వివాహాలు చేయాలని సూచించారు. సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగర ఇన్‌స్పెక్టర్లు సూచించారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల.. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

- నేర నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్వీఆర్ కల్యాణ మండపంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్లు అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు శిక్షణ తరగతులు



నెల్లూరు సిటీ: ఆర్టీసీ హైర్, తాత్కాలిక బస్సుల డ్రైవర్లకు శిక్షణ తరగతులను జోనల్ స్టాఫ్ శిక్షణ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ మాట్లాడారు. నెల్లూరు జోన్‌లో ఈ తరహాలో సుమారు రెండు వేల మంది డ్రైవర్లు పనిచేస్తున్నారని, వీరికి శిక్షణను వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయనున్నామని చెప్పారు.

ఆలయాల్లో విశేష పూజలు




రాహుకాల పూజల్లో భక్తులు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, రాహుకాల పూజలను విశేషంగా నిర్వహించారు. స్వామి వారి ప్రాకారోత్సవాన్ని వేడకగా జరిపారు.

- నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో రాహుకాల పూజలు, పల్లకిసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విశేషాలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు



మూలస్థానేశ్వరాలయంలో..

క్రైమ్ కార్నర్

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): శంకరమఠంలో చోరీ కేసులో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిందితుడి వివరాలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. మూలాపేటలోని శంకరమఠంలో సుబ్రహ్మణ్యస్వామి శూలం, ఆకాశదీపం, పంచలోహ కలశాలు, నగదు పెట్టె, ఫోకస్ లైట్లను దుండగుడు మంగళవారం అర్ధరాత్రి చోరీ చేశారు. మఠం మేనేజర్ ఉషాకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడ్ని శెట్టిగుంటరోడ్డుకు చెందిన రవీంద్రగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్ద వీరంగం

నెల్లూరు(క్రైమ్): మద్యం షాపు షట్టర్లను బలవంతంగా మూసేందుకు యత్నించడంతో పాటు వ్యక్తి వీరంగం చేసిన ఘటన వాకర్స్ రోడ్డులోని లక్కీ వైన్స్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. వైన్ షాపు వద్దకు జకీర్ చేరుకొని షట్టర్‌ను బలవంతంగా వేసేందుకు యత్నించగా, క్యాషియర్ శ్రీనివాసులు అడ్డుకున్నారు. దీంతో క్యాషియర్‌తో పాటు షాపులో ఉన్న వ్యక్తులను దూషిస్తూ, కౌంటర్ టేబుల్‌ను బలవంతంగా వెనక్కి నెట్టారు. ఘటనలో టేబుల్‌పై ఉన్న రెండు మద్యం సీసాలు పగిలిపోయాయి. ఇంతలో అక్కడున్న వ్యక్తులు ఆయన్ను తీసుకెళ్లారు. క్యాషియర్ ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై దాడి

- ఆరు సవర్ల బంగారు ఆభరణాల దోపిడీ

నెల్లూరు(క్రైమ్): అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కొందరు దాడి చేసి అతని వద్ద ఆరు సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. గూడూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సంగానికి చెందిన శ్రీనివాస మోహన్ పనిచేస్తున్నారు. మూలాపేట సమీపంలోని వేళాంగణి స్కూల్ సమీపంలో ఉంటున్న తన పిన్ని ఇంటికెళ్లేందుకు గానూ కళాశాల బస్సులో ఆ ప్రాంతంలో దిగారు. నడుచుకొని వెళ్తుండగా, రెండు బైకుల్లో వచ్చిన ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు మార్గమధ్యలో అడ్డుకున్నారు. అనంతరం అతనిపై దాడి చేసి నాలుగున్నర సవర్ల బంగారు గొలుసు, ఒకటిన్నర సవర్ల బ్రాస్‌లెట్‌ను దోచుకున్నారు. స్థానికులు అక్కడికి చేరుకునేలోపు దుండగులు పరారయ్యారు. విషయాన్ని తన స్నేహితులు చైతన్య, యానాదికి తెలియజేసి, వారి సహకారంతో చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

పాతకక్షలతో ఇద్దరిపై..

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఇద్దరిపై కొందరు దాడి చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. జెండావీధికి చెందిన ముజామిల్ , మన్సూర్‌నగర్‌కు చెందిన కత్తి శివ స్నేహితులు. శివకు, అదే ప్రాంతానికి చెందిన రాహుల్, కార్తీక్ మధ్య రెండేళ్ల క్రితం గొడవ జరిగింది. అప్పటి నుంచి వీరి మధ్య కక్షలున్నాయి. శివతో ముజామిల్ స్నేహంగా ఉండటంతో అతడిపై సైతం రాహుల్, కార్తీక్ కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో మన్సూర్‌నగర్‌లోని దుకాణ మెట్లపై ముజామిల్, శివ బుధవారం కూర్చొని ఉండగా.. రాహుల్, కార్తీక్, సంతోష్, సన్నీ మరికొందరితో కలిసి అక్కడికి వచ్చి రాళ్లు, కర్రలు, కత్తితో దాడి చేశారు. గాయపడిన ముజామిల్ నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. స్థానికంగా భిక్షాటన చేసే సదరు వ్యక్తి పాడుబడిన ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు నెల్లూరు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 60 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.